క్లుప్తంగా

ఉపాధ్యాయినికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న డైట్ కాలేజీ లెక్చరర్ ముచ్చా గోవింద్

నందికొట్కూరు: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఉపాధ్యాయురాలికి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రావాలని కర్నూలు గవర్నమెంట్ డైట్ కళాశాల లెక్చరర్ ముచ్చా గోవింద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సంతపేట గవర్నమెంట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న నాగలక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం ముచ్చా గోవింద్ తన వంతుగా రూ.10 వేల నగదును అందజేశారు. ఎంఈఓలు ఫైజున్నీబేగం, సుభాన్ మాట్లాడుతూ డైట్ కాలేజీ లెక్చరర్‌కు సమాచారం తెలిసిన వెంటనే నందికొట్కూరు పట్టణంలోని సంతపేట స్కూల్‌కు వచ్చి ఆర్థిక సహాయం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న టీచర్‌కు అండగా నిలిచి మానవత్వం చాటుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు జయమ్మ, రామకృష్ణ, అరుణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవరత్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బొల్లవరంలో మాట్లాడుతున్న కేవీఆర్ మహేశ్వరరెడ్డి

మహానంది: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జెడ్పీటీసీ, జేసీఎస్ ఇన్‌చార్జ్ కేవీఆర్ మహేశ్వరరెడ్డి సూచించారు. మహానంది మండలం తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల్లో సోమవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కన్వీనర్లు, గృహసారథులకు బీమా సౌకర్యం, బాధ్యతలు విధుల గురించి వివరించారు. బండిఆత్మకూరు మండలంలో జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి ఆధ్వర్యంలో కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పైపు లైన్ పనులను పరిశీలిస్తున్న ఏఈ జుబేర్

పాములపాడు: తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు తుమ్మలూరు గ్రామ సర్పంచు వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో జెడ్పీటీసీ నిధులు రూ.5లక్షలతో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలోని బీసీ కాలనీకి 800 మీటర్ల మేర పనులు చేస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నారన్నారు. పైపులైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంటు అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దీపానాగవేణి

కొత్తపల్లి: ప్రతి విద్యార్థి కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యురాలు దీపానాగవేణి, కంటివైద్య నిపుణులు షేక్షావలి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ కృష్ణా భాయి ఆధ్వర్యంలో 38వ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మానవ శరీరంలో నేత్రాలు చాలా సున్నితమైనవని నేత్రాలకు చిన్న గాయాలైన వెంటనే సంబంధిత వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. నేత్రాలకు గాయాలు మానేంతవరకు వైద్యాధికారుల సలహాలు పాటించాలని సూచించారు. పౌష్టికాహారం, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయాలతో కంటిచూపును మెరుగుపరుచుకోవచ్చన్నారు. అనంతరం నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ బాకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల విరాళం

మిడుతూరు: పాఠశాల అభివృద్ధికి సహకరించి బడిరుణం తీర్చుకుంటున్న గ్రామపెద్దల సహకారం మరువలేనిదని పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున నాయక్ అన్నారు. సోమవారం కలమందలపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామపెద్దలు జ్ఞానపాల్‌రెడ్డి రూ.5 వేలు విలువచేసే కుర్చీని అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రామపెద్దలు, పాఠశాల పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

జగనన్న పాలనకు ప్రజల మద్దతు

- అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్



వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న పాలనకు ప్రజలు వంద శాతం మద్దతు ఇస్తున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామసచివాలయం–1,2 పరిధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఆయా కాలనీల్లోని గడప గడపను సందర్శిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం వైఎస్ జగనన్న దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో స్వర్ణయుగంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా జవాబుదారీతనంతో పాలనను అందిస్తున్న జగన్‌ను 2024 ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పుల్లయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షుకూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిసర్వోత్తమరెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, మాధవరం రత్నం, సగినేల వృశేనయ్య, సీఐ విజయభాస్కర్, ఎస్.ఐ ఓబులేసు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట

- కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సుధాకర్‌రెడ్డి



దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. 2వ సచివాలయం పరిధిలో గడప గడప కింద మంజూరైన రూ. 20 లక్షలకు గాను రూ. 14 లక్షల నిధులను 2వ వార్డుకే ఎలా కేటాయిస్తారని డీఈపై 24వ వార్డు కౌన్సిలరు పింజరి చాంద్‌బాషా మండిపడ్డారు. ఆ వార్డు సచివాలయం కింద ఉన్న అన్ని వార్డులకు సమానంగా నిధులు మంజూరు చేయాలి. ఆ ఒక్క అంశం తప్ప మిగత అంశాలను కౌన్సిలరు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వెనుకబడిన కాలనీలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు తెచ్చారని గుర్తు చేశారు. 40 ఏళ్ల నుంచి అభివృద్ధికి నోచుకోని కర్నూలు రోడ్డుకు ఉన్న బైరెడ్డి నగర్, పగిడ్యాల రోడ్డుకు ఉన్న బైరెడ్డి నగర్, శేషశనాయనరెడ్డి, మారుతీనగర్‌ను స్పెషల్ గ్రాంట్‌తో అభివృద్ధి చేస్తునట్లు స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, కమిషనర్ కిషోర్, డీఈ నబి రసూల్, టీపీఓ బాలమద్దయ్య, , హౌసింగ్ ఏఈ అరుణ్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, మెప్మా శాంతకుమారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేయించాలి



మునగ సాగును పరిశీలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించాలని నంద్యాల జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర సూచించారు. సోమవారం దుద్యాల గ్రామ సమీపంలో హర్టీకల్చర్ పంటల సాగును పరిశీలించారు. అదేవిధంగా స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వర్మికంపోస్టు ఎరువులకోసం కట్టిన తొట్లకు, హార్టీకల్చర్ కింద సాగుచేస్తున్న పంటలకు, చేసిన పనులకు పేమెంట్స్ రాలేదని తన పరిశీలనలో తేలిందన్నారు. వాటనికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ రేష్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరును మరింత అభివృద్ధి చేస్తాం

- కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ ఆసియామారూఫ్
- త్వరలో కేజీ రహదారిలో బటర్‌ఫ్లై లైట్ల ఏర్పాటు
- పది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిన వార్డు సభ్యులు



మున్సిపల్ చైర్‌ఫర్సన్ ఆసియా మారూఫ్

ఆత్మకూరు: పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వారు మాటాడుతూ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పించామని, త్వరలోనే 24 వార్డుల్లో మరిన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూలు–గుంటూరు రహదారి వెంట బటర్‌ఫ్లై లైట్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు వేశామన్నారు. అయినా ఇంకా పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎండీఎఫ్ నిధుల కింద టెండర్లు ఏర్పాటు చేశామని, ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరానగర్, ఎస్సీబీజీ పాలెం, సీటితొట్ల వీధి, కొత్తపేటలో వీటిని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. 3వ వార్డులో విజయ్ ఇంటి నుంచి షరీఫ్ ఇంటి వరకు రూ.2 లక్షలతో సీసీ రోడ్లు, గడప గడపకు మన ప్రభుత్వంకు సంబంధించి నిధులు మంజూరు కావడంతో దాదాపు పట్టణంలో 20 చోట్ల సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది 15వ ఫైనాన్స్‌కింద రూ.95,32,740 మంజూరు అయ్యాయని , ఇందులో అమృత్ పథకానికి రూ.46,71,044 ఖర్చు చేస్తామని, పారిశుద్ధ్య అభివృద్ధికి రూ.46,71,044 లు పనులు చేపడతామని, వీటికి త్వరలోనే టెండర్ల ద్వారా పనులు అప్పగించడం జరుగుతుందన్నారు. పాతబస్టాండ్‌లో రేకులషెడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అంతకుమునుపు సభ్యులు పది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు రషీద్, వైస్ చైర్మన్ పువ్వాడి దివ్య, రాజగోపాల్, వార్డు కౌన్సిలర్లు , కోఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళి

పాములపాడు: బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వాములుల 23వ వర్ధంతి సందర్భంగా సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని లింగాల గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు రామేశ్వరరావు ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వాములు, వెంకటేశ్వరరావు, రమణమ్మ, బాలేసు తదితరులు పాల్గొన్నారు.

బషీర్ బాగ్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆత్మకూరు: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో టీడీపీ పాలనలో విద్యుత్ సమస్యలపై బషీర్ బాగ్ వద్ద చేపట్టిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీయం కార్యాలయంలో విద్యుత్ ఉద్యమంలో అమరులైన కార్మికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రజాక్, శేఖర్, మాబాష, రామ్‌నాయక్, సురేంద్ర పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మహానంది: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానంది మండలంలోని తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, లైసెన్సు, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయడం సురక్షితం కాదని పలువురిని హెచ్చరించారు. పలు వాహనదారులకు జరిమానాలు విధించారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ మధుసూదన్

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, నందికోల సేవ తదితర విశేష పూజలను ప్రముఖ న్యాయవాది సంకోటి జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సంకోటి గోవర్దన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివార్లను నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మరబోట్లు తిప్పకునేందుకు అనుమతులివ్వాలి

కొత్తపల్లి: కృష్ణానదిలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మధ్య మరబోట్లు తిప్పుకునేందుకు అనుమతులు ఇవ్వాలని బోటు నిర్వాహకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, మౌలాలి, పశువుల నారాయణ, వెంకటరమణ, తిక్కస్వామి, శ్రీనివాసులు తదితరులు స్థానిక పోలీసు స్టేషన్లో ఎస్‌ఐ హుస్సేన్ బాషాకు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గతంలో శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూములు ఇచ్చి నష్టపోయామన్నారు. ఈ ఏడాది జనవరి నెలలో కృష్ణానదిలో రెండు తెలుగు రాష్ట్రాల బోటు నిర్వాహకుల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా అధికారులు బోట్ల రాకపోకలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారన్నారు. అటు వ్యవసాయం చేసుకునేందుకు భూమిలేక, ఇటు మరబోట్లు తిప్పుకొనేందుకు అనుమతులు లేక జీవనం కష్టతరమైందని వాపోయారు. ఓ వైపు తెలంగాణ వారు బోట్లు తిప్పుకుంటున్నారని మా బోట్లు మాత్రం అలాగే నిలిచి జీవనం అస్తవ్యస్తం అయ్యిందన్నారు. స్పందించిన ఎస్‌ఐ సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

గృహ సారథులకు అవగాహన

వెలుగోడు: మండలంలోని బోయరేవుల గ్రామంలో సోమవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి గృహసారథులు, కన్వీనర్లకు బీమా సౌకర్యం గురించి వివరించారు. అలాగే వారి విధులు, బాధ్యతలపై చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, బోయరేవుల నాయకులు, మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్ రెడ్డి, రమణ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

శంకరమల్లయ్య.. వర్షం కురిపించవయ్యా!



స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు,



పాములపాడులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

జూపాడుబంగ్లా: శ్రీశంకరమలయ్య మమ్ముల్ని కరుణించి వర్షం కురిపించవయ్యా అంటూ భక్తులు స్వామి వారికి 1108 బిందెల జలంతో అభిషేకం చేశారు. సోమవారం మండలంలోని తూడిచెర్ల గ్రామం సమీపంలో వెలసిన శ్రీ శంకరమల్లయ్య స్వామి వారికి భక్తులు వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ఇంటింటికి ఒక బిందె చొప్పున నీటిని తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. జలధారలు బయటకు వెళ్లకుండా గర్భ గుడిలోనే నడుము లోతు నిలిచేలా కట్టను కట్టారు. అనంతరం నీటిని తొలగించి స్వామి వారికి వేద మంత్రాల మధ్య మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకటేశ్వర్లు యాదవ్, నాగేంద్రగౌడు, చిన్న దస్తగిరి, సంపత్‌కుమార్, వెంకటేశ్వర్లు, మదారి పాల్గొన్నారు.

వర్షం కోసం ముస్లింల ప్రార్థనలు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో ముస్లింలు ఈద్గా వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆగస్టు నెలలో వర్షాలు కురవకపోవడంతో పైర్లు పూర్తిగా ఎండిపోయాయి, పలువురు పైర్లను దున్నేశారు. అల్లా ప్రజల పై దయయుంచి వర్షం కురిపిస్తేనే తాగునీరు ఉంటుందని పేర్కొంటూ దువా చేశారు. మౌలానా అజ్మతుల్లా దువా చేయించారు. హోటల్‌బాషా, దేకర్ ఉశేన్, మహ్మద్ ఖాశీం లతో పాటు పలువురు ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలిని అదేగ్రామానికి చెందిన ఐదుగురు చంపుతామని బెదిరించడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతీశంకర్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు కడుమూరు గ్రామానికి చెందిన మరియమ్మ అనే వృద్ధురాలు ఈనెల 22వ తేదీ రాత్రి ఇంటిలో ఉండగా 9:30 గంటల సమయంలో అదేగ్రామానికి చెందిన దావీదు, వెంకటరత్నం, అనీల్, లోకేష్, భాగ్యమ్మ బయటకు ఇడ్చుకు వచ్చి చంపుతామని బెదిరించారు. పొలంలో ఉన్న బావి వద్ద సమస్యను మనసులో పెట్టుకొని బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మాత్రలు మింగి యువకుడి ఆత్మహత్య

నందికొట్కూరు: ఐదు రకాల మాత్రలు మింగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ ఖాదర్ బాషా (35) ఈ నెల 23న మద్యం మత్తులో ఐదు రకాల మాత్రలు మింగి అపస్మారకస్థితిలోకి చేరడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య అమ్రీన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బండిరమణయ్య



మహానంది: వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బొల్లవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బండిరమణయ్యను నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాలు జారీ చేసింది. మహానంది మండలం నుంచి ఆయనకు జిల్లా కమిటీలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శనగల బసవన్నకు పరోక్ష సేవ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరు పొందిన నందీశ్వరునికి త్రయోదశి సందర్భంగా సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అర్చకులు విశేషపూజలను పరోక్ష సేవగా నిర్వహించారు. ఇందులో భాగంగా నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించారు.

'ప్రపంచ బ్యాంకు తొత్తు చంద్రబాబు'

వెలుగోడు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రపంచ బ్యాంకు తొత్తుగా వ్యవహరించి విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఉద్యమకారులను కాల్చి చంపించారని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగమోహన్, తాళ్ల శ్రీనివాసులు విమర్శించారు. సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్ పోరాట అమర వీరుల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): 5– 18 ఏళ్లలోపు బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో జీఆర్ సర్వేలో భాగంగాలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. సమావేశంలో డీఈఓ, ఎంఈఓ, ఎంపీడీఓ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డ్రాప్ ఔట్ పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అలాగే.. ఇంతవరకు అడ్మిషన్ కాని వారిని కూడా గుర్తించి చేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ఎంపీడీఓ, విద్యాశాఖ, గ్రామీణ వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. డీఈఓ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఎంఈఓ బ్రహ్మంనాయక్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఓంకారేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం



సహస్రఘటాభిషేక పూజలందుకున్న ఓంకారేశ్వరుడు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి శ్రావణమాసం, సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు స్వామివారికి 1008 బిందెలతో సహస్ర ఘటాభిషేకం పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని పంచబుగ్గల కోనేరులో నుంచి పెద్దలు, చిన్నారులు బిందెలతో నీళ్లు తీసుకెళ్లి ఓంకారేశ్వరుడికి అభిషేకం చేశారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు పండాలని కాంక్షిస్తూ పూజలు చేపట్టారు.

పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జిల్లాలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మృతి చెందిన 11 మంది పోలీస్ కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మృతిచెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు విడో ఫండ్, కార్పస్ ఫండ్, ఫగ్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్ లాంటివి లబ్ధిచేకూరేలా చూస్తామన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి భాధిత కుటుంబాలకు రావాల్సిన అన్ని రకాల ఆర్థిక సాయం అందేలా చర్యలు చేపడతామని చెప్పారు. అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు ఉన్నారు.

ట్రాఫిక్ బారికేడ్స్ అందజేత

నంద్యాల పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నాగార్జున సిమెంట్ యాజమాన్యం 65 బారికేడ్లను అందించిందని ఎస్పీ కే.రఘువీర్ రెడ్డి సోమవారం తెలిపారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో వీటిని ఉపయోగిస్తామని చెప్పారు.

నేడు వాహనాల వేలం

కొత్తపల్లి: పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు నేడు బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ హుస్సేన్ బాషా సోమవారం తెలిపారు. మండలంలో వివిధ కేసుల్లో పట్టు పడ్డ సుమారు 10 ద్విచక్ర వాహనాలకు మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ఆత్మకూరు పోలీసు స్టేషన్లో వేలం వేయనున్నట్లు చెప్పారు. వేలంపాటలో పాల్గొన దలచినవారు ఆధార్‌కార్డు జిరాక్స్, రూ.1000 డిపాజిట్ చేసి పాల్గొనవచ్చునని తెలిపారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ సేవ దృశ్యం

మహానంది: శ్రావణమాసం, సోమవారం పురస్కరించుకుని మహానందీశ్వరస్వామి దంపతులకు పల్లకీ సేవ వైభవంగా జరిగింది. కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. గణపతిపూజ, అలంకార పూజ, హారతుల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీసేవ మహానందంగా సాగింది. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొని గోమాతను దర్శించుకుని తరించారు.

దోమల నివారణకు చర్యలు



జగజ్జనని గుడి వద్ద గంబూసియా చేపలను వదులుతున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలో దోమలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మలేరియా, డెంగీ లాంటి విష జ్వరాలు ప్రబలకుండా దోమల నివారణలో భాగంగా సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని నీటి కుంటల్లో జిల్లా మలేరియా అధికారి వీ. కామేశ్వరరావుతో కలిసి గంబూసియా చేపలను వదిలారు. కమిషనర్ మాట్లాడుతూ నీటి కుంటల్లో గంబుసియా చేపలను వదలడం ద్వారా అవి దోమలు లార్వాలను అంతం చేస్తాయని చెప్పారు. అలాగే మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు. కాల్వల్లో స్ప్రేయింగ్, వార్డుల్లో ఫాగింగ్, డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని వివరించారు. డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి(ఏఎంఓ) వరప్రసాద్‌రెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వచ్చే నెలలో రాయలసీమ కరువు యాత్ర

నందికొట్కూరు: సెప్టెంబర్ నెలలో రాయలసీమ కరువు యాత్రను చేపడుతునట్లు రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీశైలం ప్రాజెక్టును విద్యుత్ సంపద కేంద్రంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురవక రాయలసీమలో రైతులు అల్లాడుతున్నారని గుర్తు చేశారు. తుంగభద్ర డ్యాంపై ఎగువన నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు పూర్తయితే ప్రతి ఏడాది కరువు ఏర్పడుతుందన్నారు. తీగల వంతెన వద్దని బ్రిడ్జికం బ్యారేజి నిర్మిస్తే 60 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు నాగేశ్వరరావు ఉన్నారు.

మహానందిలో భక్తుల సందడి



కోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది : శ్రావణమాసం, సోమవారం కలిసి రావడంతో మహానంది ఆలయం భక్తజనంతో కళకళలాడుతోంది. పెళ్లిళ్లు ఉండటంతో రద్దీ మరింత పెరుగుతోంది. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్‌రెడ్డి నిరంతర దర్శన సౌకర్యం ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి సుమారు రూ. 5లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.